క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం చేసి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎన్టీఆర్ జిల్లా ఆగిరిపల్లికి చెందిన షేక్ షకీలా, రహమతుల్లా భార్యభర్తలు. వీరికి ముగ్గురు సంతానం. రహమతుల్లా తన ఇద్దరు కుమారులతో కలిసి టైర్ల వ్యాపారం చేస్తుంటాడు. కొంత కాలంగా కిడ్నీలు చెడిపోవడంతో నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఈ నెల 4వ తేదీ డయాలసిస్ నిమిత్తం ఆసుపత్రికి వచ్చేందుకు సిద్ధం కాగా, డాక్టర్లు మరుసటి రోజు రమ్మని చెప్పారు. దీంతో షకీలా మహంతిపురంలోని తన పుట్టింటికి భర్తతో కలిసి వచ్చింది. అదే సమయంలో రహమతుల్లా వించిపేటలోని ఖురేషి మసీదు వద్ద బ్లేడ్‌తో గొంతు కొసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అతనిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

కవులు సమాజాన్ని అధ్యయనం చేయాలి



విజయవాడకల్చరల్: కవులు సమాజాన్ని అధ్యయనం చేయాలని సాహితీవేత్త గంటేడ గౌరీనాయుడు అన్నారు. ఎక్స్‌రే సాహిత్య మాసపత్రిక ఏలూరు రోడ్డు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో శనివారం ఎక్స్‌రే 2020 అవార్డులు బహూకరించారు. కవి తిక్కన సోమయాజి 84 జయంతి వేడుకల కార్యక్రమాన్ని నిర్వహించింది. న్యాయనిర్ణేతగా వ్యవహరించిన గౌరీనాయుడు మాట్లాడుతూ సమాజంలో అనేక సమస్యలు, మార్పులు కనిపిస్తూ ఉంటాయని వాటిలో కాలానుగుణమైన మార్పులు వస్తూ ఉంటాయని వాటిని గమనించాలని సూచించారు. కవి సోదరులు పువ్వాడ శివరామ విఠల్, వేణుగోపాల్ మాట్లాడుతూ.. ప్రతీ ఏటా కవితల పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకుల కృషిని అభినందించారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి కవితల పోటీ లక్ష్యాలను వివరించారు. డాక్టర్ పీవీ దుర్గారాణి, ఎక్స్‌రే సాహిత్య సంస్థ ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు, ఉపాధ్యక్షుడు కందికొండ రవికిరణ్, కార్యదర్శి సీహెచ్‌వీ సుబ్బయ్య నిర్వహించారు. 2020 సంవత్సరానికి ఎక్స్‌రే ప్రధాన పురస్కారాన్ని తిరుపతికి చెందిన నల్లు రమేష్, ఉత్తమ కవితా పురస్కారాలను సాంబమూర్తి అండ, పాత్తూరి సీతారామారావు, కొంపెల్ల కామేశ్వరరావు, అవ్వారు శ్రీధర్‌బాబు, తిరువాయపాటి రాజగోపాల్, కత్తుల కిషోర్ కుమార్, బి.కళాగోపాల్, తూపిలి రవీంద్రబాబు, పద్మ సుధామణికి ఉత్తమ కవితా పురస్కారాలను అందజేశారు.

సెయింట్ జాన్స్‌లో రెయిన్‌బో డే వేడుకలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక క్రాంబ్వే రోడ్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో శనివారం నిర్వహించిన రెయిన్‌బో డే వేడుకలు అత్యంత ఉత్సాహంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా పాఠశాల ఆవరణను సప్తవర్ణాలతో అలంకరించారు. ప్రీ ప్రైమరీ చిన్నారులు ఇంద్రధనస్సులోని వర్ణాల వేషధారణతో కనువిందు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన పాఠశాల ప్రెసిడెంట్ టి.మోనిక సుమన్, సెక్రటరీ/కరస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజ్ మాట్లాడుతూ హరివిల్లులోని ప్రతి వర్ణం తనదైన ప్రత్యేకతతో నిండి ఉంటుందని, రెయిన్‌బోలోని రంగులు నమ్మకం, ప్రేరణ, ఉత్సాహం, సంతోషం వంటి అనేక సామాజిక రసానుకూల దృక్పథాలను ప్రతిబింబిస్తాయని తెలిపారు. ఇంద్రధనస్సులోని ఏడు రంగులు మన జీవితాలను ప్రభావితం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ ఆడిటర్ పావన దీప్తి, ప్రిన్సిపాల్ సీహెచ్ సుచరిత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పండుగల విశిష్టతలు తెలుసుకోవాలి

గుణదల(విజయవాడతూర్పు): భారతీయ సంస్కృతి సంప్రదాయాలలో పండుగలకు అత్యంత ప్రాధాన్యత ఉందని ప్రతి ఒక్కరూ పండుగల విశిష్టతలను తెలుసుకోవాలని సిటిజన్స్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.లక్ష్మి తెలిపారు. గురునానక్ నగర్‌లోని సిటిజన్స్ పబ్లిక్ స్కూల్‌లో దసరా సంబరాలు శనివారం నిర్వహించారు. జగన్మాతగా కొలువుదీరిన దుర్గాదేవిని తొమ్మిది రోజుల పాటు పలు అవతారాల్లో పూజలు చేస్తారన్నారు. ఈ దసరా పండుగ అందరి జీవితాల్లో భక్తి భావాలతో పాటు సుఖ సంతోషాలను నింపాలని కాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహిషాసురమర్ధని అవతారంలో త్రిశూలధారిణిగా అమ్మవారిని ప్రతిబింబించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు సర్వం సన్నద్ధం



చదును మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణ



కేటీరోడ్డులోని గంగానమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద ఏర్పాట్లు

- విద్యుత్ దీపాలతో శోభాయమానంగా దర్శనమిస్తున్న ఆలయాలు
- రోజుకొక అలంకారంతో దర్శనమివ్వనున్న అమ్మవార్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా మహోత్సవాలకు వన్‌టౌన్‌లోని ప్రధాన ఆలయాలన్నీ సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. దసరా ఉత్సవాలకు వన్‌టౌన్‌కు ప్రత్యేక స్థానముంది. ప్రధానంగా దుర్గమ్మ ఆలయానికి వచ్చే భక్తులు ప్రతి ఒక్కరూ వన్‌టౌన్‌లోని వివిధ మార్గాల మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. దానికి తోడు వన్‌టౌన్‌లో ఆలయాల్లో ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతి రోజూ ప్రత్యేక అలంకారాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా ఆలయాల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు కూడా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రముఖ కళాకారులతో పాటుగా ఔత్సాహిక కళాకారులను ఆహ్వానించి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఆలయాల్లో ప్రత్యేక వైదిక కార్యక్రమాల్లో ఉభయదాతలు పాల్గొనే విధంగా నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు.

గంగానమ్మ దేవస్థానంలో...

వన్‌టౌన్ కేటీరోడ్డులో శ్రీనివాసమహల్ సెంటర్ వద్ద ఉన్న శ్రీ గంగానమ్మ దేవస్థానంలో దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రోజుకొక ప్రత్యేక అలంకారంలో గంగానమ్మవారు దర్శనమిస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంతో పాటుగా కేటీరోడ్డులో ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఉత్సవాల అనంతరం అన్నదాన కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్రీ చదునుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో...

బ్రాహ్మణవీధిలో ఉన్న శ్రీ చదునుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రధానంగా ఆలయంలో ఉన్న శ్రీ చదునుమహాలక్ష్మమ్మ అమ్మవారితో పాటుగా అష్టలక్ష్ములకు కూడా ప్రత్యేక అలంకారాలు చేస్తామని ఆలయ అర్చకస్వాములు తెలిపారు. చదును మహాలక్ష్మమ్మకు వివిధ అమ్మవారి అలంకారాలలో, లక్ష్మీదేవి అమ్మవారికి అష్టలక్ష్ముల స్వరూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు.

శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

వన్‌టౌన్‌లోని శ్రీ ప్రార్థనా మందిరంలో ఉన్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి వార్షిక దసరా మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ తెలిపారు. ప్రతి రోజు అమ్మవారు ప్రత్యేక అలంకారాల్లో దర్శనమిచ్చేందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ఉత్సవాలను పురస్కరించుకుని మందిరం ప్రాంగణాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

పాత శివాలయంలో...

శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాత శివాలయం)లో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ అమ్మవారు ఉత్సవాల్లో భాగంగా రోజుకొక అలంకారంలో దర్శనమిచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి నాగరాజు తెలిపారు. ప్రతి రోజూ ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో...

బ్రాహ్మణవీధిలో ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో పద్మావతి అమ్మవారు ప్రతి రోజూ ప్రత్యేక అలంకారంలో దర్శనమివ్వనున్నట్లు ఆలయ అర్చకస్వాములు వివరించారు. స్వామి వారికి శ్రవణా నక్షత్రమైన విజయదశమి రోజున కల్యాణోత్సవం, అదే రోజు స్వామి వారికి శమీపూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి తొమ్మిది రోజులూ ఉభయదాతలు పూజలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సమాజ హితం కోసం యాగాలు



వేద విద్యార్థులతో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విశ్వశాంతి, సర్వమానవ హితం కోసం చేసే యాగాలు సత్ఫలితాలను ఇస్తాయని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గొల్లపూడి మౌళీనగర్‌లోని శంకర మందిరంలో శనివారం ఐంద్రాజ్ఞ నిరూఢ పశుబంధ యాగం నిర్వహించారు. యాగానికి మల్లాది విష్ణు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిబావం అలవర్చుకుని, మానవత్వంతో ముందుకు సాగినప్పుడే సమాజ వికాసం జరుగుతుందన్నారు. కరువు కాటకాలు దరి చేరకుండా వర్షాలు సమృద్ధిగా ఉండాలని, యాగ ఫలితాలు ప్రతి ఒక్కరికీ దక్కాలని ప్రార్థించానన్నారు. పాడి పంటలతో రైతులు సంతోషంగా ఉండాలని, నిరుపేదలు, సామాన్యులు సమాజంలో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్ప బలానికి దైవబలం కూడా తోడు కావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. దెందుకూరి వెంకటేశ్వర ఘనాపాటి యాజులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దెందుకూరి వెంకట సుబ్రహ్మణ్య సోమయాజి, శ్రీరామచంద్ర ఘనాపాటి, చిల్లా శ్రీనివాస బాలసుబ్రహ్మణ్య ఘనాపాటి పాల్గొన్నారు.

సామాన్య పౌరులకు దూరమవుతున్న విద్య



మాట్లాడుతున్న చిన్నయసూరి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు పెరిగే కొద్ది సామాన్య పౌరులకు విద్య దూరమవుతుందని, విద్యా సంస్థల్లో ప్రమాణాలు పడిపోతున్నాయని సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కె.చిన్నయసూరి అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ప్రజావికాస వేదిక ఆధ్వర్యంలో శనివారం విద్యారంగం ప్రమాణాలపై సెమినార్ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిన్నయసూరి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగం చాలా విస్తృతమైందని, ఆర్థిక సంస్కరణల తర్వాత విద్యా రంగంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయన్నారు. ఎమ్మెల్సీ కె.లక్ష్మణరావు మాట్లాడుతూ ఉన్నత విద్యలో బోధన, పరిశోధన, విస్తరణ మూడు లక్ష్యాలు కీలకంగా ఉన్నాయన్నారు. డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీల్లో ప్రమాణాలు కాపాడాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రైవేటు విద్య కార్పొరేట్ విద్యగా మారి రెండే రెండు బడా యాజమాన్యాల చేతిలో బందీ అయిందని, క్రమంగా ఈ శక్తులు రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రభుత్వ విధానాల్ని శాసించే స్థాయికి చేరుకున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ కన్వీనర్, రమేష్ పట్నాయక్, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ, విద్య సంస్కరణోద్యమ కార్యకర్త డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాసరావు, ప్రొఫెసర్ ఎం.సురేష్ బాబు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మద్యానికి బానిసై భార్యను వేధిస్తున్న వ్యక్తిపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వైఎస్సార్ కాలనీకి చెందిన కడాలి దుర్గ ఆటో డ్రైవర్ శివ ప్రసాద్‌ను ఎనిమిదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఇద్దరు సంతానం. కొన్నాళ్ల పాటు వీరి కాపురం సజావుగానే సాగింది. కొంతకాలంగా మద్యానికి బానిసైన శివప్రసాద్ భార్యను అనుమానించడం, మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. వేధింపులు భరించలేని ఆమె అతని నుంచి విడిపోయి పుట్టింటి వద్ద ఉంటుంది. ఈ క్రమంలో శనివారం ఉదయం దుర్గ పనికి వెళ్లేందుకు వైఎస్సార్ కాలనీ నుంచి సితార సెంటర్‌కు చేరుకుంది. అప్పటికే అక్కడ ఉన్న ఆమె భర్త శివ బలవంతంగా ఆటో ఎక్కించుకుని ఔట్ ఏజెన్సీకి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై దాడి చేయగా తప్పించుకుని భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు.

పీసీసీ మాజీ కార్యదర్శి బొట్టా భాస్కరరావు మృతి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రముఖ కాంగ్రెస్ నేత, పీసీసీ మాజీ కార్యదర్శి బొట్టా భాస్కరరావు అనారోగ్య సమస్యలతో శనివారం సాయంత్రం మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసిన బొట్టా భాస్కరరావు స్థానికంగా అందరికీ సుపరిచితులు. అన్ని పార్టీల వారితో సత్సంబంధాలను కొనసాగించేవారు. దుర్గా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్‌గా పలు మార్లు పనిచేశారు. బుద్ధ వారి దేవస్థానం చైర్మన్‌గా సైతం పనిచేశారు. వివిధ ప్రజా సంఘాల్లోనూ పలు బాధ్యతలు నిర్వహించారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహారావు, పీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర నేత చొక్కర దుర్గాప్రసాద్ వివిధ పార్టీల నేతలు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా న్యాయపోరాటం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పోరాటాల ద్వారానే వర్గీకరణకు ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలని పీవీ రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఓ హోటల్‌లో శనివారం ఉభయ రాష్ట్రాల మాలమహానాడు కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీలను విభజించాలని కుట్ర జరుగుతోందన్నారు. మాలమహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు న్యాయ పోరాటం చేసి వర్గీకరణను అడ్డుకున్నారన్నారు. సుప్రీంకోర్టు కొట్టివేసిన వర్గీకరణ అంశాన్ని మరలా తెరపైకి తెస్తున్నారని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ మద్దతుతో కొందరు వర్గీకరణ చేయాలని పట్టుబడుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో పీవీ రావు స్ఫూర్తితో మరోసారి పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం ఎస్సీలను విభజించవద్దన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా న్యాయపోరాటం చేస్తామన్నారు. సమావేశంలో మాల మహానాడు ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీసు దసరా ఉత్సవాలు ప్రారంభం

- వన్‌టౌన్ పీఎస్‌లో పోలీస్ కమిషనర్ పూజలు
- తరలివచ్చిన పోలీసు కుటుంబాలు
- గుర్రపుబండిలో దుర్గమ్మకు చీర, పసుపు కుంకుమలను తీసుకువెళ్లిన సీపీ దంపతులు



ఊరేగింపుగా దుర్గగుడికి బయలుదేరిన సీపీ, ఇతర పోలీసు కుటుంబాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నిత్యం రౌడీలు, నేరాలు, దర్యాప్తులంటూ బిజీబిజీగా దర్శనమిచ్చే నగర పోలీసులు శనివారం ఒక్కసారిగా భక్తులుగా మారిపోయారు. దుర్గమ్మకు పూజలు చేస్తూ యావత్ పోలీసు కుటుంబాలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఆధ్యాత్మిక భావనతో గడిపారు. దుర్గమ్మ దసరా ఉత్సవాల ముందు రోజున పోలీసు శాఖ నుంచి అమ్మవారికి పట్టుచీర, పసుపుకుంకుమలను సమర్పించడం గడచిన దశాబ్ద కాలంగా కొనసాగుతోంది. ఈ ఏడాది ఆ తంతు మరింత వైభవంగా నిర్వహించాలని పోలీసు కమిషనర్ నిర్ణయించి ఆ మేరకు అధికారులను ఆదేశించారు. రాష్ట్రం విడిపోయిన తరువాత నుంచి ఈ ఉత్సవాన్ని మరింత వైభవంగా నిర్వహిస్తున్నారు. పోలీసు సిబ్బంది సైతం అత్యంత ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారు. ప్రతి ఏటా వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో దసరా ఉత్సవాలను నిర్వహించడం ఎప్పటి నుంచో వస్తున్న సంప్రదాయం. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో దుర్గమ్మ కొలువు తీరి ఉండటంతో అమ్మవారి సన్నిధిలో జరిగే దసరా ఉత్సవాల్లో పోలీసులు ప్రధాన పాత్ర పోషించడం తదితర కారణాల రీత్యా స్టేషన్ ప్రాంగణంలోనూ కలశాన్ని ఏర్పాటు చేసి నిత్యం భారీగా పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది పోలీసుబాస్ సీపీ టి.కె.రాణా మరింత చొరవ చూపడంతో ఆ కార్యక్రమాన్ని భారీగా నిర్వహించాలని నిర్ణయించారు. రాత్రి ఏడు గంటల సమయంలో సీపీ దంపతులు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు చేరుకుని అక్కడ ప్రతి ఏటా నిర్వహించే విధంగా రావిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కె.హనుమంతరావుతో పాటుగా నగరంలోని సీఐలందరూ సతీపతుల సమేతంగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ సిబ్బంది మొత్తం కుటుంబ సమేతంగా కార్యక్రమానికి హాజరయ్యారు. పూజల అనంతరం సీపీ దంపతులు అమ్మవారికి సమర్పించే పట్టుచీర, ఇతర పసుపుకుంకుమలను చేతబూని గుర్రపుబగ్గీ ఎక్కి దుర్గగుడికి పయనమయ్యారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, పోలీసుబ్యాండ్, తీన్‌మార్ సందడితో పాటుగా పోలీసులు భారీగా బాణసంచా కాలుస్తూ ఊరేగింపుగా దుర్గమ్మ సన్నిధికి తరలివెళ్లారు. తొలిసారిగా ఇంత పెద్ద స్థాయిలో ఉత్సవానికి శ్రీకారం చుట్టడంతో పోలీసు సిబ్బంది మొత్తం హర్షం వ్యక్తం చేస్తూ ముందుకు సాగారు. ముఖ్యంగా మహిళా పోలీసు అధికారులందరూ సివిల్ డ్రస్‌లో కుటుంబ సభ్యులతో కలిసి కార్యక్రమానికి హాజరవడం విశేషం. స్థానిక సీఐ రావి సురేష్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. డీసీపీ విశాల్ గున్ని, ఏడీసీపీ (ట్రాఫిక్) డి.ప్రసాద్, ఏసీపీ ట్రాఫిక్ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధునీకరించిన ప్రాంగణాన్ని ప్రారంభించిన సీపీ, ఎమ్మెల్యే

వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో పూర్తిగా శిథిలావస్థకు గురైన పాత పోలీసుస్టేషన్‌లోని కొన్ని గదులను ఆధునీకరించారు. ఆ ప్రాంగణాన్ని సీపీ టి.కె.రాణా స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు.





దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు ఇంద్రకీలాద్రి ముస్తాబైంది. ఆదివారం నుంచి తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు జరుగనున్నాయి. ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్షేత్రస్థాయిలో ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



సీతమ్మ వారి పాదాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే వెలంపల్లి, చైర్మన్, ఈవో

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల ఏర్పాట్లను దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శనివారం పరిశీలించారు. మంత్రితో పాటు పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, సీపీ టి.కె.రాణా, డీసీపీ విశాల్ గున్ని, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఫెస్టివల్ ఆఫీసర్ ఆజాద్, ఈవో కేఎస్ రామారావులతో పాటు పాలక మండలి సభ్యులు ఏర్పాట్లను పరిశీలించారు. సీతమ్మ వారి పాదాల వద్ద స్నానఘాట్‌ను పరిశీలించిన మంత్రి ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కెనాల్‌రోడ్డులోని క్యూలైన్లు, కనకదుర్గనగర్‌లో ప్రసాదాల కౌంటర్లు పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశామన్నారు. కొండ రాళ్లు విరిగిపడటంతో క్యూలైన్‌లో కొన్ని మార్పులు చేశామన్నారు. వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, క్యూలైన్ మార్గంలో ప్రత్యేకంగా టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. 3500 మంది పోలీసులు, 300 దేవస్థాన సిబ్బందితో పాటు డెప్యూటేషన్ సిబ్బందితో కలిసి ఉత్సవాల విధుల్లో పాల్గొంటారన్నారు. ప్రొటోకాల్ ఉన్న వారికి మాత్రమే వీఐపీ దర్శనం కల్పిస్తున్నామని, మూలా నక్షత్రం రోజున సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని, దీని కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

భక్తులకు ఉచిత వైద్య సేవలు అభినందనీయం

పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడిక సభ్యులు అభినందనీయులని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నుంచి ప్రారంభం అవుతున్న దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 23వ తేదీ వరకు ఇంద్రకీలాద్రి దిగువన గల కనకదుర్గనగర్‌లో ఏర్పాటు చేసిన 24 గంటలు ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం సాయంత్రం వెలంపల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రులకు అనేక ప్రాంతాల నుంచి వచ్చే అమ్మవారి భక్తులకు ఆరోగ్య సమస్యలు ఏర్పడితే ఇక్కడ వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. క్లబ్ సీనియర్ సభ్యులు, ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ దేవతి నాగేశ్వరరావు మాట్లాడుతూ దసరా ఉత్సవాల సందర్భంగా గత 19 ఏళ్ల నుంచి ఇక్కడ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తూ మందులు కూడా అందజేస్తున్నామని చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటలకు ఉచిత ప్రసాద వితరణ కూడా చేస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్ జిల్లా 316 డి గవర్నర్ జేఎస్ శంకర్ గుప్తా హాజరు కాగా, గద్దె శేషగిరిరావు, కొనకళ్ల విద్యాధరరావు, డాక్టర్ కోలా విజయశేఖర్, క్లబ్ అధ్యక్షుడు పీవీ నారాయణరావు, కోశాధికారి జి.లక్ష్మీనారాయణ, కోట సుబ్బారావు, ఉమా శంకర్, పి.శ్రీనివాసరావు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అలుపెరగని బాలల హక్కుల నేత ప్రథమ మేయర్ టీవీ



టీవీకి నివాళులర్పిస్తున్న ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ నిర్వాహకుడు కోటేశ్వరరావు తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగర ప్రథమ మేయర్ టి.వెంకటేశ్వరరావు(టీవీ) ఆపదలో ఉన్న బాలలకు అండగా ఉండి, బాలల హక్కుల పరిరక్షణకు పాటుపడ్డారని ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ నిర్వాహకుడు బీఎస్ కోటేశ్వరరావు తెలిపారు. హనుమాన్‌పేటలోని తానా భవన్‌లో ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు టీవీ 10వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. తొలుత టీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఎంతో ముందు చూపుతో 25 సంవత్సరాల క్రితమే బాలల హక్కుల పరిరక్షణకు అందరినీ ఒకే వేదిక మీద పైకి తెచ్చిన గొప్ప వ్యక్తి టీవీ అని కొనియాడారు. టీవీ ఆశయాలను ముందుకు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో ఆర్డినేటర్ అరవ రమేష్, ఎస్‌కేసీవీ చిల్డ్రన్ ట్రస్ట్ చీఫ్ కోఆర్డినేటర్ కె.చంద్ర, బర్న్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీ కోటి ప్రకాష్ కుమార్, ప్రజా గాయకుడు ఆర్.పిచ్చయ్య, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు .

వేగాలో దసరా, దీపావళి ఆఫర్లు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వనమా నవీన్, సుధాకర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని బృందావనకాలనీ నందమూరిరోడ్డులోని వేగ జ్యూయలర్స్‌లో ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నట్లు ఆ షోరూమ్ అధినేతలు వనమా నవీన్, వనమా సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా షోరూమ్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆఫర్ల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంతో విశ్వాసంతో మమ్మల్ని ఆదరిస్తున్న ఖాతాదారులకు పండుగల సందర్భంగా ప్రత్యేక రాయితీలు కల్పించడం తమ బాధ్యతగా పేర్కొన్నారు. అందులో భాగంగా ఈ నెల 15 నుంచి నవంబర్ 13వ తేదీ వరకు ఆఫర్లు ప్రవేశపెట్టామని తెలిపారు. వజ్రాభరణాలపై క్యారట్‌కు రూ.55,999 చార్జి చేస్తున్నామన్నారు. పోల్కీ ఆభరణాలపై ఎలాంటి మేకింగ్ చార్జీలు, తరుగు లేవని తెలిపారు. బంగారు ఆభరణాలపై ఎలాంటి మేకింగ్ చార్జీలను ఈ ఆఫర్ కాలంలో వసూలు చేయమని వారు పేర్కొన్నారు. తమ షోరూమ్‌లో ఆధునిక ఫ్యాషన్ ప్రపంచానికి సరితూగే ఎన్నో రకాల సరికొత్త ఆభరణాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని వనమా నవీన్, వనమా సుధాకర్ తెలిపారు. ఈ ప్రత్యేక ఆఫర్లను వినియోగించుకుని దసరా, దీపావళి పండుగలను సంతోషంగా జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.